# ప్రేమించే హృదయం

"ప్లీజ్... నన్ను లోపలికి పంపండి... నేను మా అమ్మానాన్నల్ని చూడాలి!"

తెలుగు మాటలు వినిపించి తలెత్తి చూశాడు ప్రణవ్. ఓ అమ్మాయి వార్డుగేటు దగ్గర కాపలా ఉన్న వాచ్‌మన్‌ని ఏడుస్తూ అర్థిస్తోంది.

తమిళనాడు రాయవెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లోని ఎమర్జెన్సీ వార్డు అది... సమయం రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది!

ప్రణవ్ లేచి ఆ అమ్మాయి దగ్గరగా వెళ్లాడు.

ఆమె చాలా అందంగా ఉంది. ఇరవైయ్యేళ్ల వయసుంటుంది. తెల్లగా పాలరాతి శిల్పంలా ఉంది.

"ఏం కావాలి మీకు?" ప్రణవ్ అడిగాడు ఆమెని.

"నిన్నరాత్రి మా అమ్మా నాన్నలకు యాక్సిడెంటైంది. టూర్లో ఉన్న నేను విషయం తెలిసి పరుగెత్తుకొచ్చాను. నాకు వాళ్ళెలా ఉన్నారో చూడాలనివుంది. ఈయన నన్ను లోపలికి వెళ్లనివ్వడం లేదు..." అంది ఆ అమ్మాయి కన్నీళ్లతో.

ప్రణవ్ వాచ్‌మన్‌తో తమిళంలో మాట్లాడాడు. ఆ అమ్మాయి తరపు బంధువులెవరో లోపలికి వెళ్లారనీ, ఆయన వచ్చాక ఆమెను లోపలికి పంపుతాననీ చెప్పాడు అతను.

"మీవాళ్ళెవరైనా లోపలికి వెళ్లారా?" ఆమె నడిగాడు ప్రణవ్.

"మా పెదనాన్న వెళ్లారు. ఆయన వెళ్లి పావుగంట దాటుతోంది. అందుకే నాకు ఆందోళనగా ఉంది!"

"మీరు ధైర్యంగా ఉండండి. మీ అమ్మానాన్నలు క్షేమంగానే ఉండివుంటారు. మీరు అలా కూర్చుని దేవుణ్ణి ప్రార్థించండి. మీ పెదనాన్న రాగానే మిమ్మల్ని లోపలికి పంపే ఏర్పాటు చేస్తాను" అన్నాడు ప్రణవ్.

ఆమె బెంచీపై కూర్చుని కళ్ళు మూసుకుంది. టెన్షన్ వల్ల ఆమె చేతులు వణుకుతున్నాయి. ప్రణవ్ వాచ్‌మన్ దగ్గరికెళ్లి "ఆమె అమ్మానాన్నలు ఎలా ఉన్నారు?" అని అడిగాడు మెల్లగా.

"వాళ్ళింకా ఎక్కడ ఉన్నారు? నిన్న రాత్రి ఇక్కడికి తీసుకుని వచ్చినపుడే చనిపోయి ఉన్నారు. ఆ అమ్మాయి లోపలికివెళ్లి చూస్తే తట్టుకోలేదు. పెద్దాయన వచ్చి ఆమెకు నచ్చచెబుతాడని చూస్తున్నాను."

షాక్ తిన్నట్టు నిలబడిపోయాడు ప్రణవ్. మనసంతా కలచివేసినట్టు అయింది అతనికి. ఆ అమ్మాయి వైపు చూశాడు. కళ్ళు మూసుకుని కూర్చుని ఉంది. అతని మనసు ఆమెపట్ల జాలితో నిండిపోయింది.

"మార్చురీ ఎక్కడుంది?"

"లోపల వైపున ఉంది. ఆ పెద్దాయన్ని అక్కడికే తీసుకెళ్లారు."

ఇంతలో... ఓ వ్యక్తి లోపలినుంచి బయటకు వచ్చాడు. సుమారు అరవైయ్యేళ్లుంటాయి అతనికి. ఆ అమ్మాయి చటుక్కున కళ్ళు తెరిచి ఒక్క పరుగున ఆయన దగ్గరకు వెళ్లి "అమ్మానాన్నా ఎలా ఉన్నారు పెదనాన్నా?" అని అడిగింది ఆత్రుతగా.

అతను మాట్లాడలేకపోతున్నాడు. కన్నీళ్లు ఆపుకోలేకపోతున్నాడు.

"పెదనాన్నా... నాన్న ఎలా ఉన్నారు? ప్లీజ్ః... చెప్పండి పెదనాన్నా!" ఆయన భుజాలు పట్టుకుని కుదుపుతూ అడిగింది ఏడుస్తూ.

ఆయన ఒక్కసారిగా బావురుమన్నాడు. ఆమెకి విషయం అర్థమైనట్లుంది. షాక్ తిన్నట్టు చూసింది ఆయనవైపు. తర్వాత మెల్లగా "అమ్మ..?" అంది భయంభయంగా చూస్తూ.

ఆయన తల అడ్డంగా ఊపారు.

ఆ తర్వాత ఆమె ఏడుపు అక్కడున్న వారందరినీ కదిలించింది.

ఆ దృశ్యాన్ని చూస్తున్న ప్రణవ్ కళ్ళనిండా నీరు నిండింది.

●

వారివెంట ఎవరూ లేకపోవడం గమనించిన ప్రణవ్- హాస్పిటల్ ఫార్మాలిటీస్ ముగించడానికి వారికి సహాయం చేశాడు.

అతనికి తమిళభాష రావడం వల్ల, అతను ఆ హాస్పిటల్‌కి చాలాసార్లు వచ్చి ఉండటంవల్ల పనులు సులభంగా పూర్తయ్యాయి.

ఉదయం ఐదు గంటలకు అంబులెన్స్ తిరుపతి బయలుదేరింది.

ఆ అమ్మాయి పెదనాన్న ప్రణవ్ చేయి అందుకుని "చాలా థాంక్స్ బాబూ! నువ్వు ఈ హాస్పిటల్‌లో పనిచేస్తావా?" అని అడిగాడు.

"లేదండీ... మాది చిత్తూరు. మా మేనత్తకు కాస్త సీరియస్ అయితే ఇక్కడ చేర్పించాం. రేపు ఆవిడను డిశ్చార్జి చేస్తారు."

"మాకు స్నేహితుడివి కావు, బంధువువి కావు. వయసులో చిన్నవాడివైనా మాకు ఎంతో సహాయం చేశావు. థ్యాంక్ యు వెరీ మచ్" — 

ఎంతో సహాయం చేశావు. ఉయ్ ఓ యు ఎ లాట్!"

"ఆప్తబంధువునే అనుకోండి. మీరు ధైర్యం తెచ్చుకోండి... ఆ అమ్మాయికి ధైర్యం చెప్పండి. అక్కడ మీకు సహాయం చేయడానికి ఎవరైనా ఉన్నారా... లేదా నన్నూ మీతోపాటు రమ్మంటారా?"

"మరి, మీ మేనత్త?"

"ఆవిడ దగ్గర మా నాన్నగారూ, మా చిన్నాన్నలూ ఉన్నారు."

"వద్దులే బాబూ! ఇప్పటికే చాలా శ్రమ ఇచ్చాం నీకు. అక్కడ నేను చూసుకుంటానులే!"

అంబులెన్స్ కదిలింది.

ఆ అమ్మాయి వైపు చూశాడు ప్రణవ్. ఆమె తన తల్లిదండ్రుల పార్థివదేహాలపై పడి రోదిస్తోంది.

●

సంవత్సరం తర్వాత తిరుపతి ఎస్.వి.ఇంజనీరింగ్ కాలేజీలో ఎం.టెక్.కోర్సులో చేరిన ప్రణవ్- తన క్లాస్‌రూమ్‌లో ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమె... రాయవెల్లూరు హాస్పిటల్‌లో కనిపించిన అమ్మాయి.

క్లాసయ్యాక ఆమెను పలకరించాడు.

"అరెఁ... మీరా? బాగున్నారా? ఆరోజు మీరు మాకు చాలా సహాయం చేశారు. కనీసం మీ ఫోను నంబరైనా తీసుకోనందుకు చాలా బాధపడ్డాను..." అంది ఆమె.

"మీరున్న పరిస్థితి అటువంటిది. ఒకేసారి తల్లిదండ్రులిద్దరినీ కోల్పోవడం ఎంత బాధాకరమో నేనర్థం చేసుకోగలను. ఇప్పుడు మీరు ఎక్కడ ఉంటున్నారు?"

"హాస్టల్లో ఉంటున్నాను. నేను ఎం.టెక్. చేయాలని మా అమ్మకు కోరికగా ఉండేది. అందుకే యూనివర్శిటీలో సీటు రాగానే చేరిపోయాను."

"మీ పెదనాన్నగారు బాగున్నారా?"

"బాగున్నారు. నాన్నగారి ఆఫీసు నుంచి రావలసినవన్నీ ఆయనే దగ్గరుండి నాకు అందేలా చూశారు. తర్వాత ఆయన నెల్లూరు వెళ్లిపోయారు. మా నాన్న నన్ను ఒంటరిదాన్ని చేసి పోయినా... నా జీవనానికి లోటు లేకుండా చేసి వెళ్లారు."

"మీరు ఒంటరివారు ఎలా అవుతారు? మీకు తోడుగా ఓ మంచి స్నేహితుడు ఉన్నప్పుడు?"

"స్నేహితుడెవరు?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేనే! మీకు ఏం కావలసివచ్చినా నన్ను అడగండి. నేను తెచ్చిస్తాను. ఏ అవసరమొచ్చినా నన్ను పిలవండి... మీ ముందు ఉంటాను. ఇఫ్ ఎ పేరెంట్ కెన్ టేక్ ద రోల్ ఆఫ్ ఎ ఫ్రెండ్... ఎ ఫ్రెండ్ టూ కెన్ టేక్ ద రోల్ ఆఫ్ ఎ పేరెంట్!"

"థాంక్యూ... థాంక్యూ వెరీమచ్!" ఆనందంగా అంది.

"నా పేరు ప్రణవ్!"

"నా పేరు మేఘన!"

●

అన్నట్లుగానే ప్రణవ్- మేఘనకు అన్నివిధాలా సహాయం చేయసాగాడు.

టౌను నుంచి ఆమెకు కావలసిన వస్తువులు తెచ్చి ఇవ్వడం, లైబ్రరీలో దొరకని పుస్తకాల్ని సీనియర్ల దగ్గర తీసుకుని ఆమెకివ్వడం, రాత్రుల్లో ఎక్కువసేపు మేల్కొని నోట్స్ తయారుచేసుకుని ఆమెకు ఇవ్వడం... లాంటి సహాయాలు చేసేవాడు. అలా చేయడంవల్ల అతనికీ సబ్జెక్టులో మంచి పట్టు లభించేది. పరీక్షల్లో మొదటి రెండు ర్యాంకులూ వీళ్ళిద్దరికే దక్కేవి.

క్రమంగా ఇద్దరి మధ్యా స్నేహం పెరిగింది. ప్రతిరోజూ ఆమె సెల్‌కు మెసేజ్ పంపేవాడు ప్రణవ్. ఇంటర్నెట్ నుంచి సేకరించిన కొటేషన్స్‌తో పాటు అతను తయారుచేసిన కొటేషన్స్ కూడా పంపేవాడు. మేఘన ఉదయం లేవగానే ఆ కొటేషన్స్ చదివేది. ఆ కొటేషన్స్ కవితాత్మకంగా, స్ఫూర్తిదాయకంగా ఉండటంతో అవి ఆమె మనసుకు ఆహ్లాదాన్నీ, ఉత్సాహాన్నీ ఇచ్చేవి.

ఇద్దరూ సినిమాల గురించీ, క్రికెట్ గురించీ, రాజకీయాల గురించీ చర్చించుకునేవారు. ఒకరు మంచి సినిమా చూస్తే రెండోవాళ్ళనీ చూడమని చెప్పేవారు.

దీపావళి పండుగకి కాలేజీకి సెలవులు ఇచ్చారు. ప్రణవ్ మేఘనను పండుగకి చిత్తూరు రమ్మని చెప్పాడు. ఆమె అతని కోరికను సున్నితంగా తిరస్కరించి, తను హాస్టల్లోనే ఉంటాననీ, పండుగ సెలబ్రేట్ చేసుకునే మూడ్ తనకు లేదనీ చెప్పింది.

"పోనీ... మీ పెదనాన్న దగ్గరికి వెళ్ళవచ్చుగా?" అన్నాడు ప్రణవ్.

"మా పెద్దమ్మకు మేమంటే పడదు. ఫర్వాలేదు... మీరు వెళ్లిరండి!"

"సరే... హ్యాపీ దీపావళి! పండుగరోజు మీరు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను."

"థాంక్యూ..."

●

"మేడమ్... మీకోసం ఎవరో వచ్చారు!"

ఆయా వచ్చి చెప్పడంతో- విజిటర్స్ రూమ్‌లోకి వచ్చి చూసిన మేఘనకు ప్రణవ్ కనిపించాడు. "అరెఁ... మీరా? అదేమిటీ... పండుగ పూట ఇంట్లో ఉండకుండా ఇలా వచ్చారు?" అంది ఆశ్చర్యంగా.

"మిమ్మల్ని విష్ చేద్దామని వచ్చాను."

"విష్ చేయాలని చిత్తూరు నుంచి తిరుపతి వచ్చారా?!"

"ఎంతసేపండీ... గంటసేపు ప్రయాణం- అంతేగా! మళ్లీ భోజనానికి చిత్తూరులో ఉంటాను."

"కూర్చోండి..." తనూ కుర్చీలో కూర్చుంటూ అంది.

"మీరు ఏమనుకోకుంటే మీకు ఓ గిఫ్ట్ తెచ్చాను."

"గిఫ్టా... ఏమిటది?"

ప్రణవ్ చేతిలోని ప్లాస్టిక్ కవర్‌లోంచి ఓ అట్టపెట్టె, స్వీట్‌ప్యాకెట్ తీసి ఆమె ముందు టీపాయ్‌పై పెట్టాడు. అట్టపెట్టె తీసిచూసిన ఆమె- ఇబ్బందిగా అతని వైపు చూసింది.

"మీకు నచ్చలేదా?"

"మీరు చీర ప్రజెంట్ చేయడం నచ్చలేదు. స్వీటు ఇచ్చారు... బాగుంది. ఏ పెన్నో, పుస్తకమో ఇచ్చినా సంతోషించేదాన్ని. దయచేసి ఇది తీసుకెళ్లిపోండి!"

ప్రణవ్ నిరుత్సాహపడ్డాడు... ఆమె మాటలు విని.

"సారీ... మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను" అంటూ లేచి, అట్టపెట్టె అందుకోబోయాడు. అంతలో... మేఘన పెదనాన్న రావడంతో ఆ ప్రయత్నం మాని కుర్చీలో కూర్చున్నాడు.

ఆయన ప్రణవ్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. ప్రణవ్- మేఘన క్లాస్‌మేట్ అని తెలుసుకుని ఎంతో సంతోషపడ్డాడు. తర్వాత తన చేతిసంచీ లోంచి అట్టపెట్టె, స్వీట్ ప్యాకెట్ తీసి ఆమె చేతిలో పెట్టి-

"తీసుకోమ్మా! నీ వయసు పిల్లలంతా కొత్తబట్టలు వేసుకుని, అమ్మానాన్నలతో ఆనందంగా పండుగ జరుపుకుంటూంటే... నువ్వు ఇక్కడ ఒంటరిగా ఉండటం నా మనసును కలచివేస్తోందమ్మా! నిన్ను ఇంటికి తీసుకెళదామంటే మీ పెద్దమ్మ ఒప్పుకోదు. అక్కడికి వచ్చి నీవు అవమానం పొందడం నాకూ ఇష్టం లేదు. నువ్వు ఎక్కడున్నా ఆనందంగా ఉండాలి. నేను కోరుకునేది అదేనమ్మా!" అన్నాడు.

ఆమె ప్రణవ్ వైపు చూసింది.

ప్రణవ్ లేచి నిలబడి, ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

మేఘన పెదనాన్న అతను వెళ్లిన వైపే చూస్తూ- "ఈ రోజుల్లో కూడా ఇంత మంచికుర్రాళ్ళు ఉండటం చాలా అరుదు" అన్నాడు. తర్వాత మేఘన ముందున్న ప్యాకెట్లను చూసి "ఆ అబ్బాయి కూడా నీకు గిఫ్ట్స్ తెచ్చినట్లున్నాడు?!" అన్నాడు.

"అరెరె... ఆయన వీటిని తీసుకెళ్లడం మరచిపోయారు!" అంది మేఘన.

"తీసుకెళ్లడం ఏమిటి? అవి నీకోసం తెచ్చినవి కావా?"

"నా కోసమే తెచ్చారు. కానీ, ఆయన చీర తేవడం నాకెందుకో ఎబ్బెట్టుగా అనిపించింది. అందుకే వద్దన్నాను."

"తప్పేముందమ్మా! పండుగరోజు హాస్టల్లో నువ్వు ఒంటరిగా ఉండటం అతన్ని బాధించి ఉంటుంది. నువ్వూ కొత్తబట్టలు వేసుకుని, తీపి తినాలని ఆశపడి ఉంటాడు. నేను నీ గురించి ఎలా ఫీల్ అయ్యానో అతనూ అలాగే ఫీల్ అయ్యాడు. నేను చెప్పాను. అతను చెప్పలేకపోయాడు. అంతే తేడా! ఎదుటి మనిషి గురించి తపించే అతని తత్వం మనం ఆరోజు హాస్పిటల్లో చూశాం కదమ్మా! మనం ఏది చేస్తే ఒక మనిషికి ఆనందం కలుగుతుందో అది చేస్తే తప్పులేదమ్మా! అది తప్పు కాదని మన మనసు చెబితే చాలు!"

●

సెలవులయ్యాక కాలేజీకి వచ్చిన ప్రణవ్- తను ప్రజెంట్ చేసిన చీరలో కనిపించిన మేఘనను చూసి ఆశ్చర్యపోయాడు.

"థాంక్యూ వెరీమచ్!" అన్నాడు సంతోషంగా.

"మీరు ఓసారి నాకు ఓ కొటేషన్ పంపారు... 'అఫెక్షన్ ఈజ్ ఎన్ ఇన్‌టాన్జిబుల్ వన్. బట్ వెన్ ఇట్ టచెస్ అవర్ హార్ట్... ఇట్ బికమ్స్ టాంజిబుల్' అని! యువర్ అఫెక్షన్ ఈజ్ టాంజిబుల్ వన్!" అంది మేఘన.

కాలేజీకి కొన్ని కంపెనీలు ఇంటర్వ్యూ చేయడానికి వస్తున్నాయని తెలియడంతో ఇద్దరూ ప్రిపేర్ కాసాగారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఇద్దరూ సెలెక్ట్ అయి మంచి కంపెనీల్లో ఉద్యోగాలు తెచ్చుకున్నారు.

ప్రాజెక్ట్ వర్క్ అయ్యాక హాస్టల్ ఖాళీచేసి చిత్తూరు ప్రయాణమయ్యాడు ప్రణవ్. మేఘన బెంగుళూరుకి బయలుదేరబోతోంది. ఇద్దరూ క్యాంపస్‌లో ఓ చోట కలుసుకున్నారు.

"ఆల్ ద బెస్ట్ ప్రణవ్!" అంది మేఘన.

"థాంక్యూ! రెండేళ్లు రెండు వారాలుగా గడిచిపోయాయి. కలసి చదువుకున్నాం, భావాలు పంచుకున్నాం, ఆరోగ్యకరమైన పోటీతో చదువులో కూడా రాణించాం, మంచి ఉద్యోగాలు సంపాదించుకున్నాం. 'రేపట్నుంచి మిమ్మల్ని చూడలేను' అన్న ఆలోచనే భరించలేకుండా ఉన్నాను."

"ఒకవేళ మీకూ బెంగుళూరుకే పోస్టింగ్ ఇస్తే మనం తరచుగా కలుసుకోవచ్చుగా ప్రణవ్?"

"కలుసుకోవడం వేరు- కలసి ఉండటం వేరు! మనం జీవితాంతం కలసి ఉండాలని నేను కోరుకుంటున్నాను."

ఆమె అర్థంకానట్లు చూసింది.

"మీకిష్టమైతే మనం పెళ్ళి చేసుకుందాం మేఘనా!"

ఆమె భయంగా చూసింది అతని వైపు.

అతను ఆశ్చర్యపోయాడు. తనంటే ఆమెకూ ఇష్టం ఉందనీ, తను పెళ్ళి ప్రస్తావన తెస్తే ఎంతో ఆనందిస్తుందనీ అనుకున్నాడు. ఆమె ముఖంలో భయం చూసి ఎంతో నిరుత్సాహం చెందాడు. "ఏం మాట్లాడరు?" ఆమె మౌనంగా ఉండిపోవడం చూసి అడిగాడు.

"నాకు పెళ్ళిపట్ల ఆసక్తి లేదు ప్రణవ్!"

"ఎందువల్ల?"

"ప్రత్యేకంగా ఫలానా కారణం అని చెప్పలేను. మా నాన్న తాగుడు వల్ల మా అమ్మ ఎంత నరకం అనుభవించిందో నేను చూశాను. చివరకు ఆయన తాగి, కారు డ్రైవ్ చేయడంవల్ల ఆయనతో పాటు మా అమ్మనూ పోగొట్టుకున్నాను."

"నాకు ఎటువంటి వ్యసనాలూ లేవు మేఘనా!"

"మా నాన్నకూ పెళ్ళప్పుడు లేవు. హోదా పెరిగేకొద్దీ ఆయనకు దురలవాట్లు పెరిగాయి. నేను బి.టెక్. చదువుతున్నప్పుడు మా ఎదురింట్లో ఓ యువకుడు ఉండేవాడు. అతనంటే మా వీధిలోని చాలామంది అమ్మాయిలకు హీరోవర్షిప్ ఉండేది. అతను ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి కూడా చాలా అందంగా ఉండేది. అయితే ఆ అమ్మాయికి నరకం చూపాడు అతను. చివరకు ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది.

తర్వాత కూడా అలాంటి చాలా సంఘటనలు నా దృష్టికి వచ్చాయి. వాటి గురించి తలచుకుంటే మనసు కలచివేసినట్లు అనిపిస్తుంది. నేను పెళ్ళి వద్దనటానికి ఇవన్నీ కారణాలు కావచ్చు, కాకపోవచ్చు. కానీ, నాకీ ఒంటరి జీవితమే బాగుంది. నేను మిమ్మల్ని ఓ స్నేహితుడిగా ఇష్టపడతాను, గౌరవిస్తాను. నన్నర్థం చేసుకోండి... ప్లీజ్!"

"సరే... మీ ఇష్టం! ఆల్ ద బెస్ట్... బై!" అని వెళ్లిపోయాడు ప్రణవ్.

వెళ్తునప్పుడు అతని కళ్ళలో నీరు తిరగడం చూసి ఆమెకు ఎంతో బాధ, అతనంటే జాలి కలిగాయి. తర్వాత మనసు దిటవుపరచుకుని హాస్టల్ వైపు నడిచింది.

ఉన్నట్టుండి ఆమెకు అంతవరకూ ఉన్నదేదో కోల్పోయినట్టు అనిపించసాగింది. ఈ రెండేళ్లూ ప్రతిరోజూ, ప్రతి గంటా, ప్రతి క్షణం తన ఆలోచనల్లో చోటుచేసుకున్నాడు ప్రణవ్. అతను అడిగినప్పుడు ఆలోచించలేదు గానీ... ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తోంది...

'ప్రణవ్ లేకుండా తను ఉత్సాహంగా, ఆనందంగా ఉండగలదా?'

●

నెలరోజుల తర్వాత ప్రణవ్ మేఘనకు ఫోన్ చేశాడు.

"ఎల్లుండి ఆదివారం మా చెల్లెలికి నిశ్చితార్థం జరుగుతోంది. మీరు వస్తే నేను ఎంతో సంతోషిస్తాను."

"తప్పకుండా వస్తాను. బయలుదేరేముందు మీకు ఫోన్ చేస్తాను."

"అలాగే! నేను బస్‌స్టేషన్‌కి వచ్చి మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటాను."

నిశ్చితార్థం కల్యాణమంటపంలో జరిగింది. ఫంక్షన్‌కి చాలామంది వచ్చారు. ప్రణవ్ అంతటా తానై బిజీగా తిరిగాడు. అయితే అంత బిజీలో కూడా మధ్యమధ్యలో మేఘన దగ్గరికి వచ్చి పలకరించడం... ఆమె టిఫిన్, భోజనాల గురించి విచారించడం... ఆమెకెంతో ఆనందాన్నిచ్చింది. అంతేకాదు, ప్రణవ్ తల్లిదండ్రులు, నాయనమ్మ, చెల్లెలు మాధురి, బంధువులు అందరూ ఆప్యాయంగా మాట్లాడటం ఆమె మనసుని కదిలించింది.

ఫంక్షన్ అయ్యాక మాధురి 'ఇద్దరమ్మాయిలు' సినిమాలోని 'ఈ చల్లని లోగిలిలో' పాట పాడింది. తర్వాత వరుడి పార్టీ, వధువు పార్టీల మధ్య 'అంత్యాక్షరి' కార్యక్రమం జరిగింది. ప్రణవ్ చక్కగా పాటలు పాడుతూ, డ్యాన్స్ చేయడం ఆమెను ఆశ్చర్యపరచింది.

'ఇతనికి రాని విద్యే లేనట్లుంది' అనుకుంది మనసులో.

సాయంత్రం మేఘన- ప్రణవ్ తల్లి శ్యామల దగ్గరకు వెళ్లి "ఆంటీ! నేనిక బయలుదేరుతాను. ప్రణవ్ ఎక్కడికెళ్లారు?" అని అడిగింది.

"బయటికెళ్లాడు... వచ్చేస్తాడులే! కూర్చోమ్మా... తాంబూలం ఇస్తాను!" అంది శ్యామల.

తాంబూలం పళ్లెంలో చీర, రవిక చూసి, ఇబ్బందిగా ముఖంపెట్టి "ఇప్పుడివన్నీ ఎందుకు ఆంటీ?" అంది మేఘన.

"మొదటిసారి మా ఇంటికి వచ్చావు. ఫర్వాలేదు... తీసుకోమ్మా!"

మేఘన తాంబూలం తీసుకున్నాక "ఉదయం ముహూర్త సమయంలో నీవు కట్టుకున్న చీరలో చాలా బాగున్నావమ్మా! ఆ చీర నా సెలెక్షనే!" అంది శ్యామల.

"అంటే... ప్రణవ్ ఆ చీర నాకు ప్రజెంట్ చేయడం... మీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగింది మేఘన.

"తెలుసమ్మా! దీపావళికి మేమందరం బట్టలు కొంటూంటే వాడు అన్యమనస్కంగా ఉండటం చూసి విషయమేమిటని అడిగాను. అప్పుడు నీ గురించి చెప్పాడు. నేను ఓ చీర సెలెక్ట్ చేసి వాడికిచ్చి, నీకు ప్రజెంట్ చేయమని చెప్పాను. 'ఆ అమ్మాయి ఏమనుకోదా?' అని వాడడిగితే 'స్వచ్ఛమైన మనసుతో ఇవ్వు... తీసుకుంటుంది' అన్నాను. వాడు మంచి మనసుతో ఇచ్చాడు కాబట్టే మొదట నువ్వు తిరస్కరించినా తర్వాత తీసుకున్నావు."

తమ మధ్య జరిగిన ప్రతి విషయం తల్లితో చెప్పినందుకు ప్రణవ్‌పై మేఘనకు కోపం వచ్చింది.

"మా పిల్లలకు ప్రతి విషయం మాతో పంచుకోవడం అలవాటు. మాధురికి ఎదురైన ఈవ్ టీజింగులూ, అందుకున్న ప్రేమలేఖలూ, స్నేహితురాళ్ళతో జోక్స్... అన్నీ మాతో చెప్పేది. ప్రణవ్ కూడా అంతే! మా ఇంటి డైనింగ్‌రూమ్ మాకందరికీ ఇష్టమైన ప్రదేశం. ఇంట్లో ఉన్నా, బయట తిరుగుతున్నా ఎనిమిదిన్నరకు అందరం డైనింగ్‌రూమ్‌లో ఉండాలి... కలిసి భోంచేయాలి... అనుభవాలూ, అనుభూతులూ, అభిప్రాయాలూ కలిసి పంచుకోవాలి."

తన మనసును చదివినట్లే ఆమె మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయింది మేఘన.

"చిన్నప్పట్నుంచీ మా పిల్లలకి సభ్యత, సంస్కారం ఉగ్గుపాలతో పోసి పెంచానమ్మా! అన్నిటినీ మించి సేవాదృక్పథం వాళ్ళలో పెంపొందేలా చూశాం. వాళ్ళ నాన్న ఎవరికి ఏ అవసరమొచ్చినా నేనున్నానంటూ వెళ్లేవారు. పెద్దలు ఎలా ప్రవరిస్తే పిల్లలూ అలాగే ప్రవర్తిస్తారు. ఆయన సేవాదృక్పథం మా పిల్లలకూ వచ్చింది. అందుకే వాడు వయసులో చిన్నవాడైనా హాస్పిటల్లో పెద్దమనిషిలా మీకు సహాయం చేశాడు.

వాడు నిన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పగానే మేము నిన్ను చూడకుండానే మా సమ్మతిని తెలియజేశాం... మాలో ఒకరిపై ఒకరికి అంత నమ్మకం! నువ్వు వాడి ప్రేమను తిరస్కరించినా వాడు నీపై కోపం పెంచుకోలేదు. ఎందుకంటే... మేము వాడికి ప్రేమించడమే నేర్పాం, ద్వేషించడం నేర్పలేదు."

"కానీ, ఆరోజు నుంచీ ప్రణవ్ నాకు ఫోన్లు చేయడం లేదు, మెసేజెస్ పంపడం లేదు!" బుంగమూతి పెట్టి అంది మేఘన.

"నిన్ను తన జీవితభాగస్వామిని చేసుకుందామని ప్రణవ్ చాలా ఆశపడ్డాడు. నీవు కాదనడంతో డీలా పడ్డాడు. మనసుకి తగిలిన గాయాలకు కాలమే మందు! వాడు కోలుకుంటాడు. నాకా నమ్మకం ఉంది. జీవితంలో ఎదురుదెబ్బలు తగలడం మంచిదే! అప్పుడే వాటిని తట్టుకునే శక్తి పెరుగుతుంది. ప్రణవ్ కోలుకునేంతవరకే ఈ నిశ్శబ్దం! జీవితం అడ్వర్‌టైజ్‌మెంట్ కాదు కదా... ఒక్క క్షణంలో 'ఇట్స్ గాన్... పోయిందే!' అనడానికి!"

మేఘన నవ్వింది.

"పెళ్ళి గురించి నీ అభిప్రాయం వాడు చెప్పాడు. కాలుతుందని నిప్పుకు దూరంగా ఉండటం మంచిదే! కానీ, ప్రతి వస్తువూ కాలుతుందని భయపడటం అవివేకం. నీవు పేర్కొన్న ఉదాహరణల గురించి కూడా వాడు చెప్పాడు. ఈ రోజుల్లో చదువులూ, పరీక్షల పేరుతో

పిల్లల్ని తమ బంధుమిత్రులకు దగ్గర కానీయడం లేదు చాలామంది తల్లిదండ్రులు. శుభకార్యాలకు గానీ, అనారోగ్యం, ఇతర కష్టసమయాల్లో గానీ పిల్లల్ని తల్లిదండ్రులు వెంట తీసుకెళితే తమవాళ్ళకు పిల్లలు దగ్గరౌతారు. అక్కడి పనులు పంచుకోవడం వల్ల వాళ్ళకు బాధ్యతలు తెలుస్తాయి, బంధాలు ఏర్పడతాయి. 'రేపు తానేదైనా తప్పు చేస్తే ఇంత మందికి సమాధానం చెప్పాలి' అన్న భయం వారిని తప్పు చెయ్యనివ్వకుండా చేస్తుంది.

ప్రేమించడం, ప్రేమింపబడటం మధురమైన అనుభూతులనిస్తాయి. 'మనకోసం ఒకరు ఆలోచిస్తున్నారు' అన్న భావన ఎంత తియ్యనైందో ప్రేమిస్తేనే తెలుస్తుంది. నువ్వు మా ప్రణవ్‌ని ప్రేమించకపోయినా ఫరవాలేదు. నీకు నచ్చిన వ్యక్తిని ప్రేమించి పెళ్ళాడు లేదా పెళ్ళాడి ప్రేమించు! ఒంటరిగా జీవించడం అసాధ్యం కాదు. కానీ, ఏ అనుభూతులూ లేకుండా జీవించడం వల్ల ప్రయోజనం ఏమిటి? ప్రపంచంలో కష్టాలే కాదు, సుఖాలూ ఉన్నాయి. కిరాతకులే కాదు, దేవతలూ ఉన్నారు. మనమే పరీక్షించి ఎన్నుకోవాలి."

●

**బ**స్‌స్టేషన్‌కి మేఘనకు వీడ్కోలు చెప్పడానికి వచ్చిన ప్రణవ్-

"శ్రమ తీసుకుని ఇంత దూరం వచ్చారు... చాలా థాంక్స్! మా ఇంట్లో మీకేం ఇబ్బంది కలుగలేదు కదా?" అని అడిగాడు.

"లేదు. నాకు మీవాళ్ళంతా బాగా నచ్చారు. మీరు మీ ఇంటిని ఎందుకు అంతగా ఇష్టపడతారో నాకు ఈరోజు అర్థమైంది. 'ఎ హౌస్ ఈజ్ మేడ్ ఆఫ్ బ్రిక్స్, బట్ ఎ హోమ్ ఈజ్ మేడ్ ఆఫ్ హార్ట్స్' అని మీరనేవారు. అది మూమ్మాటికీ నిజం! మీ మాధురి పాడినట్లు 'వచ్చేపోయే అతిథులతో మీ వాకిలి కళకళలాడాలి. లక్ష్మి, సరస్వతి, మేఘన పొందికగా మీ ఇంటను కాపురముండాలి!" అంది మేఘన.

ప్రణవ్ ఆశ్చర్యంగా చూశాడు ఆమె వైపు.

మేఘన సిగ్గుపడుతూ నవ్వింది.

●

'ఈనాడు' దినపత్రిక 'ఈనాడు ఆదివారం' ... 30 డిసెంబర్' 2007 సంచికలో ప్రచురితమైన కథ

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

**జయంతి పబ్లికేషన్స్**

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.